www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం... తెలుగు దిన పత్రిక

తెలంగాణ | మంగళ వారం, 29 నవంబర్ 2022 | ఎడిటర్ : గోసుకొండ వృద్విరాజు | సంపుటి - 07, సంచిక-198 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak





## 2023 డిసెంబర్ నాటికి యాదాద్రి పవర్ ప్లాంట్

- గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు పనుల కొనసాగింపు
- ఏరియల్ సర్వే ద్వారా పనుల పురోగతి పరిశీలన
- త్వరగా పనులు పూర్తి చేయాలన్న సిఎం కెసిఆర్

**నల్లగొండ, నవంబర్ 28 (సమ సమాజం):** నేషనల్ గ్రీన్ ట్రిబ్యులన్ సూచనల మేరకు పవర్ ప్లాంట్ పనులు కొనసాగాలని సిఎ కెసిఆర్ సూచించారు. ఎక్కడా పర్యావరణానికి విఘాతం లేకుండా చూడాలన్నారు. యాదాద్రి అల్ట్రా మెగా థర్మల్ పవర్ ప్లాంట్ పనులను ముఖ్యమంత్రి కేసీఆర్ ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి, ఆ శాఖ ఉన్నతాధికారులతో కలిసి కేసీఆర్ ఏరియల్ వ్యూ ద్వారా పనుల పురోగతిని పరిశీలించారు. నిర్మాణ పనుల వివరాలను ముఖ్యమంత్రికి అధికారులు

3లో



## బండి సంజయ్ యాత్రకు హైకోర్టు అనుమతి

### షరతులతో కూడిన అనుమతి మంజూరు

- భైంసా నుంచి యాత్రకు అనుమతి లేదని వెల్లడి
- కేవలం 500 మందితో మాత్రమే యాత్రకు అనుమతి
- హైకోర్టు ఆదేశాలతో నేటి నుంచి యాత్రకు సంకల్పం

**హైదరాబాద్, నవంబర్ 28 (సమ సమాజం):** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ నిర్వహించనున్న ఐదో విడత ప్రజా సంగ్రామ యాత్రకు హైకోర్టు షరతులతో కూడిన అనుమతి ఇచ్చింది. పాదయాత్ర భైంసాలో నుంచి వెళ్ళకూడదని స్పష్టం చేసింది. నిర్మల్ మీదుగా పాదయాత్ర వెళ్లాలని తెలిపింది. ప్రజాసంగ్రామ యాత్రకు సంబంధించిన బహిరంగ సభ కూడా భైంసాకు 3 కిలోమీటర్ల దూరంలో జరుపుకోవాలని న్యాయస్థానం సూచించింది. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల మధ్య మాత్రమే సభ జరుపుకోవాలని కోర్టు

3లో

## హైకోర్టు సూచనల మేరకే పాదయాత్ర

### నేటినుంచి యాత్రరీ షెడ్యూల్ : బిజెపి



**హైదరాబాద్,నవంబర్ 28 (సమ సమాజం):** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేపట్టిన ఐదోవిడత ప్రజా సంగ్రామ యాత్ర మంగళవారానికి వాయిదా పడింది. పాదయాత్రను నేటినుంచి ప్రారంభించనున్నట్లు ప్రజా సంగ్రామ యాత్ర ప్రముఖ్ మనోహర్ రెడ్డి ప్రకటించారు. హైకోర్టు సూచనల మేరకు సభ, పాదయాత్రను రీషెడ్యూల్ చేసినట్లు చెప్పారు. బండి సంజయ్ పాదయాత్రకు

3లో

## బలవంతపు మతమార్పిళ్లపై త్వరలో చట్టం

### సుప్రీంకు నివేదించిన కేంద్ర ప్రభుత్వం



**న్యూఢిల్లీ, నవంబర్ 28 (సమ సమాజం):** కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. బలవంతపు మత మార్పిళ్లకు వ్యతిరేకంగా త్వరలో చట్టం తేవాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. బలవంతపు మత మార్పిళ్ల అంశాన్ని తాము తీవ్రంగా పరిగణిస్తున్నామని, అతి త్వరలో దీనిపై చట్టం తీసుకొస్తామని వెల్లడించింది. ఇప్పటికే 9 రాష్ట్ర ప్రభుత్వాలు బలవంతపు మత మార్పిళ్లకు వ్యతిరేకంగా చట్టాలు

3లో

## కొత్త సచివాలయానికి ముహూర్తం ఖరారు

### జనవరి 18న ఛాంబర్ ప్రవేశం చేయనున్న కెసిఆర్



**హైదరాబాద్, నవంబర్ 28 (సమ సమాజం):** తెలంగాణ కొత్త సచివాలయం ప్రారంభానికి ముహూర్తం ఖరరు అయ్యింది. సంక్రాంతి వెళ్లిన మూడోరోజు అంటే జనవరి18న ప్రారంభానికి సిఎం కెసిఆర్ నిర్ణయించారు. ఈ మేరకు ముహూర్తాన్ని తెలంగాణ ప్రభుత్వం ఖరారు చేసింది. పాత సచివాలయాన్ని కూలగొట్టి అదే స్థానంలో తెలంగాణ ప్రభుత్వం కొత్త సచివాలయాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. దాదాపు నిర్మాణం పూర్తి కావచ్చింది. ఈ క్రమంలోనే ప్రారంభోత్సవానికి తెలంగాణ ప్రభుత్వం డేట్, టైమ్ ఫిక్స్ చేసింది. 2023, జనవరి 18 వ తేదీన కొత్త సచివాలయాన్ని ప్రారంభించనుంది. ఆ రోజు నుంచి ప్రభుత్వ కార్య కలాపాలు ప్రారంభించనుంది. అప్పటికల్లా పనులు పూర్తి చేయాలని ఆర్అండ్బీ అధికారులు, షాపూర్జీ పల్లోంజీ నిర్మాణ సంస్థకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. ముందుగా 6వ అంతస్తులోని సీఎం బ్లాకును ప్రారంభించి తన ఛాంబర్లో కేసీఆర్ బాధ్యతలను స్వీకరించనున్నారు.

## మధ్యప్రదేశ్‌లో కొనసాగుతున్న జోడోయాత్ర

### సైకిత్ తొక్కుతూ ఉత్సాహంగా సాగిన రాహుల్



**భోపాల్, నవంబర్ 28 (సమ సమాజం):** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర నిరాటంకంగా 82వ రోజుకు చేరింది. యాత్రలో భాగంగా ప్రస్తుతం మధ్యప్రదేశ్‌లో పర్యటిస్తున్న రాహుల్ ఉత్సాహంగా ముందుకు సాగుతున్నారు. ఇదే క్రమంలో ఆ రాష్ట్రంలోని మోవ్‌లో పర్యటిస్తూ కొంతదూరం సైకిల్ తొక్కుతూ ముందుకు సాగారు. దానికి సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతు న్నాయి. రాహుల్ గాంధీ సైకిల్ తొక్కుతున్న సమయంలో ఆయనకు కట్టుదిట్టమైన భద్రతల మధ్య కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు చుట్టుముట్టారు.యితే రాహుల్ గాంధీ చేపట్టిన ఈ యాత్రలో కాంగ్రెస్ నాయకుడి ప్రజలను ఆకర్షిస్తూ ముందుకు సాగుతున్నాడు. చేస్తున్న చిన్నచిన్న పనులతోనే ప్రజలందరినీ ఆకట్టుకుంటూ వెళ్తున్నాడు. ఫుట్‌బాల్ ఆడటం, గిరిజనులతో కలిసి నృత్య ప్రదర్శన చేయడం, నడవడం, రాష్ట్రవ్యాప్తంగా స్థానికులతో సరదాగా

3లో

## చురుకుగా అంబేడ్కర్ విగ్రహ పనులు

### ఎప్రిల్‌లో ప్రారంభించేలా ఏర్పాట్లు

### పనులను పరిశీలించిన మంత్రులు వేముల,కొప్పుల



**హైదరాబాద్, నవంబర్ 28 (సమ సమాజం):** రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనులను ఫిబ్రవరిలో పూర్తిచేస్తామని మంత్రి ప్రశాంత్ రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు పనులు త్వరితగతిన జరుగుతున్నాయని చెప్పారు. ఫిబ్రవరి మాసంలో పనులు పూర్తి చేస్తామన్నారు. ఏప్రిల్‌లో అంబేద్కర్ జన్మదిన

3లో

## ప్రధాని మోడీ అభినవ పూలే: బిజేపీ ఎంపీ లక్ష్మణ్



**హైదరాబాద్, నవంబర్ 28 (సమ సమాజం):** ప్రధాని మోడీ అభినవ పూలే అని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. జోతిరావ్ పూలే వర్ధంతి సందర్భంగా లక్ష్మణ్ ఆయనకు నివాళులు అర్పించారు. సమాజంలో మార్పు కోసం పూలే కుటుంబం ఎంతో కృషి చేసిందన్నారు. జ్యోతిరావ్ పూలే ఆశయాలకు అనుగుణంగా మోడీ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మోడీ తన కేబినెట్?లో 70శాతం మంత్రి పదవులు అణగారిన వర్గాలకు కేటాయించారని లక్ష్మణ్ తెలిపారు. బీసీ కమిషన్?కు రాజ్యాంగ హోదా కల్పించారన్నారు. కేసీఆర్ తన కుటుంబానికి మాత్రమే పదవులు ఇచ్చుకున్నాడని విమర్శించారు. జనాభాలో అధికశాతం ఉన్న బీసీలకు మూడు మంత్రి పదవులిచ్చి వారిని మోసం చేశారని మండిపడ్డారు. మోడీకి కేసీఆర్?కు చాలా తేడా ఉందన్నారు.

## ఢిల్లీలో మరో దారుణ హత్య ఘటన

### భర్తను చంపి ముక్కలుగా కోసి ఫ్రిజ్‌లో దాచి..



**న్యూఢిల్లీ, నవంబర్ 28 (సమ సమాజం):** దేశాన్ని కుదిపేసిన శ్రద్ధా వాకర్ హత్యకేసు ఘటనను దేశం మర్చిపోక ముందే తూర్పు ఢిల్లీలోనే జరిగిన మరో ఘటన సంచలనమైంది. ఈ రెండింటికీ పోలిక ఉండడం ఇప్పుడు సర్వత్ర చర్చనీయాంశమైంది. మొదటి భర్తకు పుట్టిన కొడుకు

3లో

## కర్నాటకతో పాటే తెలంగాణలో ఎన్నికలు

### ముందస్తు ఎన్నికలకు సిద్దం అవుతున్న కెసిఆర్

### బిజెపి కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్న రాజగోపాల్



**నిర్మల్, నవంబర్ 28 (సమ సమాజం):** తెలంగాణలో ముందస్తు ఎన్నికలు జరుగుతాయని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

3లో

## మహిళల వస్త్రధారణపై అనుచిత వ్యాఖ్యలు

- తీవ్ర దుమారంతో దిగి వచ్చిన బాబా
- మహిళలకు క్షమాపణలు చెబుతూ ప్రకటన

**న్యూఢిల్లీ, నవంబర్ 28 (సమ సమాజం):** మహిళల వస్త్రధారణపై ప్రముఖ యోగా గురువు రాందేవ్ బాబా చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపడంతో బాబా మహిళలకు క్షమాపణలు చెప్పారు. ఈ వ్యాఖ్యలపై బాబా రాందేవ్‌కు మహారాష్ట్ర

3లో

## సిఎం పర్యటిస్తే అరెస్ట్ చేయాలా

### కాంగ్రెస్ నేతల అరెస్ట్‌పై రేవంత్ ఆగ్రహం



3లో

**హైదరాబాద్, నవంబర్ 28 (సమ సమాజం):** సీఎం వస్తుంటే ప్రజా ప్రతినిధుల్ని అరెస్టులు చేస్తారా అంటూ పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి మండిపడ్డారు. హామీలు అమలు చేయాలని అడిగితే అరెస్టులు చేయడమేంటని ప్రశ్నించారు.

## రేవంత్ ఏకపక్ష నిర్ణయాలు: జగ్గారెడ్డి

**సంగారెడ్డి, నవంబర్ 28 (సమ సమాజం):** టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిపై సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి, జగ్గారెడ్డిల జాగీరు కాదన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి చెబితే తాను ఎందుకు మాట్లాడతానని ప్రశ్నించారు. టీపీసీసీ పదవి నుంచి రేవంత్ రెడ్డిని దించేసి ఆ కుర్చీలో కూర్చోవాలనే



3లో

# సంపాదకీయం

## విభజన తరవాత కూడా క్రేజ్ తగ్గని హైదరాబాద్ !

దక్షిణాది రాష్ట్రాల్లో ఉన్న నగరాల్లో ఇప్పుడు హైదరాబద్ అత్యంత ప్రధాన నగరంగా మారింది. పెట్టుబడు లకు గమ్యస్థానంగా నిలిచింది. ప్రత్యేక తెలంగాణ తరవాత హైరాబాద్ అభివృద్ధి కుంటుపడుతుందని అంతా భావించారు. రియల్ ఎస్టేట్ పడిపోతందని శాపనార్థాలు పెట్టారు. కానీ హైదరాబాద్ పురోభివృద్ధి ఎక్కడా ఆగలేదు. సరికదా మరింత పురోగమిస్తూ పోతోంది. విభజన తరవాత ఎపికి రాజధాని లేకుండా పోయింది. అమరావతి నిర్మాణం ఆగిపోయింది. మూడు రాజధానులు అంటూ మూడున్నరేళ్లుగా చేస్తున్న కుటిల ప్రయత్నాల కారణంగా ఎపికి దశదిశ లేకుండా పోయింది. నిజానికి అమరావతి నిర్మాణం జరిగి ఉన్నా అక్కడ అభివృద్ధి శరవేగంగా సాగేది. అలాగే పెట్టుబడులు వచ్చి పడేవి. ఒకవేళ విశాఖనే రాజధానిగా చేసుకున్నా అభివృద్ధి గాడిన పడేది. ఇప్పటికే ఎంతో అభివృద్ధి సాధించేది. అయితే ఏదీ కాకుండా మూడు రాజధానుల పేరుతో చేస్తున్న కాలయాపన వల్ల తెలంగాణకు కలసి వస్తోంది. దీనికితోడు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ విషయంలో బిజెపిని నిలదీయడంలో ఎపి సిఎం జగన్ పూర్తిగా విఫలమయ్యారు. కడప ఉక్కుకు దిక్కు లేకుండా పోయింది. సాగునీటి రంగం కుదేలయ్యింది. పోలవరం ఎప్పుడు పూర్తవుతుందో చెప్పలేని పరిస్తితి ఏర్పడింది. ఈక్రమంలో పెట్టుబడులు పెట్టాలనుకున్న వారు ఎపిని వదిలి హైదరాబాద్‌నే తమ గమ్యస్థానంగా ఎంచుకుంటున్నారు. దీనికితోడు తెలంగాణలో విద్యుత్, సాగునీటిరంగాలకు సిఎం కెసిఆర్ అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో ఇక్కడ భూముల రేట్లు కూడా బాగా పెరిగాయి. దీంతో ప్రతి ఒక్కరూ హైదరాబాద్ వైపు చూస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ విస్తరణ శరవేగంగా సాగుతోంది. దీనికి తగ్గట్లుగా రవాణా సౌకర్యాలు కూడా పెరుగుతున్నా సరిపోవడం లేదు.కరోనా తరవాత సొంతవాహనాలు సమకూర్చు కోవడంతో ఇప్పుడు హైదరాబాద్ రోడ్లపై విపరీతంగా ట్రాఫిక్ పెరిగింది. మెట్రో అమల్లోకి వచ్చినా రవాణా కొరత తీవ్రంగా ఉంది. ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నాయి. అనేక ఫ్లై ఓవర్లు నిర్మించారు. గతంతో పోలిస్తే ఈ ఎనిమిదేళ్లలో హైదరాబాద్‌లో ఎన్నో ఫ్లై ఓవర్లు అందుబాటులోకి వచ్చాయి. మెట్రోను మరింత విస్తరిం చడం ద్వారా హైదరాబాద్ ట్రాఫిక్ అసరాలను పెంచాలని సిఎం కెసిఆర్, మంత్రి కెటిఆర్ నిరంతరంగా శ్రమిస్తున్నారు. ఈ క్రమంలోనే హైదరాబాద్ మెట్రో రైల్ సెకండ్ ఫేజ్ ప్రాజెక్టును రూ.6,250 కోట్లతో చేపట్టనున్నట్లు మంత్రి కేటీఆర్ తెలిపారు. మైండ్‌స్పేస్ జంక్షన్ నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్ట్ వరకు 31 కిలోమీటర్లు మెట్రో రెండో నిర్మిస్తామని, ఇందుకు సీఎం కేసీఆర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని వెల్లడించారు. ఈ పనులకు డిసెంబర్ 9న సీఎం శంకుస్థాపన చేస్తారని చెప్పారు. ఈ మేరకు ఆయన ట్విట్టర్‌లో ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్న మెట్రో సెకండ్ ఫేజ్ పనుల ను మూడేండ్లలో పూర్తి చేస్తామని కూడా పేర్కొన్నారు. బీహెచ్‌ఈఎల్ నుంచి లక్డీకాపూల్ వరకు 26కి.మీ.లు, నాగోల్ నుంచి ఎల్‌బీ నగర్ వరకు 5 కి.మీ.ల మెట్రో రైల్ విస్తరణ పనులకు సంబంధించిన డీపీఆర్‌ను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించామని, ఈ మేరకు సంప్రదింపులు జరుపుతున్నామని వివరించారు.నాగోల్ - అమీర్‌పేట్ -మియాపూర్ మెట్రో కారిడార్ 2017 నవంబర్‌లో ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చింది. ఎల్‌బీ నగర్-అమీర్‌పేట్ మెట్రోరైల్ మార్గాన్ని 2018 అక్టోబర్‌లో ప్రారంభించారు. ఎంజీబీఎస్ నుంచి జేబీఎస్ దాకా మెట్రో రైల్ 2020 ఫిబ్రవరిలో అందు బాటులోకి వచ్చింది. ఇప్పుడు సిటీలోని ఐటీ కారిడార్‌ను ఎయిర్ పోర్ట్‌తో కలిపే కీలక మార్గానికి శంకుస్థాపన చేయనున్నారు. దీంతో ఎయిర్‌పోర్టుకు వెళ్లే మార్గంలో రద్దీ తగ్గడంతో పాటు ఐటి కారిడార్‌తో ఎయిర్‌పోర్టు అనుసంధానం కానుంది. హైదరాబాద్ ప్రజలు ఏళ్ల తరబడి కలలుగన్న మెట్రో రైలు కార్యరూపం దాల్చినా ప్రయాణ సౌకర్యం ద్వారా ఇక జంటనగరాలల్లో ట్రాఫిక్ సమస్యలు తీరలేదు. దీనికి కారణం నగరం శరవేగంగా విస్తరించడమే కారణంగగా చెప్పుకోవాలి. నగర రోడ్లపై బారులు తీరే వాహనాల రద్దీ తగ్గ లేదు. ఇందుకు నగర ట్రాఫిక్ పోలీసులు, జిహెచ్‌ఎంసి, ఆర్టీసీలు సమన్వయంగా పనిచేస్తున్నా ట్రాఫిక్ జంఝాటం నుంచి బయటపడలేక పోతున్నాం. ఇదంతా కూడా అభివృద్ధికి నిదర్శనంగగా మాత్రమే చూడాలి. అలాగే మెట్రో మార్గం ద్వారా నగర పౌరులు, ఉద్యోగులు, సందర్శకులు తమ గమ్యాలకు చేరుకునేలా ప్రణాళికా బద్దంగా చర్యలు తీసుకుంటే తప్ప నగర రోడ్లకు విముక్తి రాదు. ట్రాఫిక్ కష్టాలకు చెక్ పడదు. అసంపూర్తిగా ఉన్న మెట్రో మార్గాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసి ఇక నగరంలో రోడ్లను అభివృద్ధి చేసే పనిలో సర్కార్ పడాలి. అప్పుడే అంతర్జాతీయ నగరంగా పేరున్న హైదరాబాద్‌లో ట్రాఫిక్ కష్టాలు గట్టెక్కగలవు. ఇరుకు రోడ్లు, అరకోటి దాటిన వాహనాలతో హైదరాబాద్ నగరంలో ప్రయాణం ఎంత నరకమో అందరికీ తెలిసిందే. అలాంటి వెతల నుంచి మెట్రోతో విముక్తి కలుగుతుందని రాజధాని ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఏసీలో ప్రయాణం, కొన్ని నిమిషాల వ్యవధిలోనే అనుకున్న స్టేషన్‌కు చేరుకునే అవకాశం ఉండటంతో మెట్రో టిక్కెట్ ఎక్కువగా ఉందని ఎక్కువమంది భావించడం లేదు. తెలుగు రాష్ట్రాల్లోనూ తొలి మెట్రో కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచి హైదరాబాద్ వచ్చేవారంతా మెట్రో ఎక్కటానికి మక్కువ చూపిస్తున్నారు. ఉమ్మడి ఎపి రాజధాని హైదరాబాద్‌లో మెట్రో నిర్మించాలని 2008 నుంచి ప్రయత్నాలు ప్రారంభ మయ్యాయి. మెట్రో నిర్మాణానికి తొలుత మేటాస్‌తో చేసుకున్న ఒప్పందాన్ని వివిధ కారణాలతో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. 2010 ఫిబ్రవరిలో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) పద్ధతిలో పాతబస్తీ మినహా మెట్రో నిర్మాణానికి మళ్లీ టెండర్లు పిలిచి ఎల్‌అండ్‌టీకి అప్పగించాక పనులు పూర్తయ్యాయి. నగర జనాభా కోటికి, ప్రైవేటు వ్యక్తిగత వాహనాలు దాదాపు అరకోటికి చేరి అనునిత్యం ట్రాఫిక్ కష్టాలతో అలమటిస్తున్న నగర వాసులకు మెట్రో ఓ వరంగా భావించాలి. ప్రజలు మెట్రోలో ప్రయాణించాలన్న కాంక్ష పెరిగితే, అందుకు తగ్గట్లుగా ఉంటే తప్పకుండా నగరరోడ్లపై కార్ల రద్దీ తగ్గగలదు. పెరుగుతున్న ట్రాఫిక్ ,జనాభా, వాహనాల రద్దీకి తగ్గట్లుగా మన మెట్రోను మరింత విస్తరించాల్సి ఉంది. శంషాబాద్ వరకు మెట్రో విస్తరణ అన్నది ఓ మంచినిర్ణయం. దీనికైనా బిజెపి నేతలు సాయానికి ముందుకు వస్తారా లేదా చూడాలి.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

## పాదయాత్ర పేరుతో రెచ్చగొడుతున్న బండి

మండిపడ్డ చీఫ్‌విప్ వినయ్ భాస్కర్



హనుమకొండ, నవంబర్ 28 (సమ సమాజం): బండి సంజయ్‌ది అహంకార, కుట్రపూరిత యాత్ర అని ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్ భాస్కర్ అన్నారు. పాదయాత్ర పేరుతో ప్రజలను రెచ్చగొడుతున్నాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. దమ్ముంటే విభజన చట్టంలోని హామీలను కేంద్ర ప్రభుత్వంతో అమలు చేయించాలని సవాల్ విసిరారు. ఆ తర్వాతే యాత్రలు చేయాలన్నారు. హనుమకొండలో ఎంపీ పసునూరి దయాకర్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజల మద్దతుతో ఏర్పాటైన ప్రభుత్వాలను కూల్చాలనుకుంటే ప్రజలు సహించరని చెప్పారు. తెలంగాణ అభివృద్ధిని చూసి కేంద్రం ఓర్వలేకపోతున్నదని విమర్శించారు. ఈడీ, ఐటీ దాడులతో కేసీఆర్ కుటుంబం సహా, మంత్రులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వెల్లడించారు. బీజేపీ నాయకుల కుట్రలను తిప్పికొడతామన్నారు. కేసీఆర్ ఆమరణ దీక్ష వల్లే తెలంగాణ ఆవిర్భావం జరిగిందని చెప్పారు. నవంబర్ 29న దీక్ష దివస్‌ను ఘనంగా జరుపుకొంటామన్నారు. మంగళవారం నుంచి డిసెంబర్ 9 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

## ముందస్తు ఎన్నికలు ఊహాగానాలే

- కొందరు పనిగట్టుకుని చేస్తున్న ప్రచారం
- వాపును చూసి బలుపుగా భావిస్తున్న బిజెపి
- మంత్రి హరీష్ రావు



సిద్దిపేట, నవంబర్ 28 (సమ సమాజం): ముందస్తు ఎన్నికల ప్రచారంపై రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావు స్పందించారు. రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలకు వెళ్లే ఆలోచన తమ పార్టీకి లేదని, తాము కానీ, తమ పార్టీ అధినేత కూడా ఎక్కడా చెప్పలేదన్నారు. ముందస్తు ఎన్నికలకు వెళ్లాల్సిన అవసరం టీఆర్ఎస్ పార్టీకి అసలు లేదన్నారు. ముందస్తు ఎన్నికలకు వెళ్తామనేది బీజేపీ జ్యోతిష్యులు చెప్పే మాట అని, కొంతమంది బీజేపీ నేతలు జ్యోతిష్యులుగా మారి అప్పుడప్పుడు ముందస్తు ఎన్నికలపై జోస్యం చెబుతుంటారని హరీష్ రావు సెటైర్లు పేల్చారు. తాము జైలుకు వెళ్తామని, టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ పార్టీలోకి వస్తారని కొంత మంది బీజేపీ నేతలు జ్యోతిష్యం చెబుతూ ఉంటారని హరీష్ రావు విమర్శించారు. మునుగోడులో టీఆర్ఎస్‌కు మెజార్టీ తగ్గడాన్ని చూసి బీజేపీ బలపడిందని అనుకుంటే పొరపాటు అని, బీజేపీ నేతలు వాపును చూసి బలుపు అనుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఐదు నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు జరిగితే.. రెండు ఉపఎన్నికల్లో బీజేపీ డిపాజిట్లు కోల్పోయిందన్నారు. హుజూర్‌నగర్, నాగార్జున సాగర్ ఉపఎన్నికల్లో బీజేపీకి సరైన అభ్యర్థులు దొరకలేదని, అక్కడ ఆ పార్టీ బలంగా లేదన్నారు. దుబ్బాక, హుజురాబాద్, మునుగోడు ఉపఎన్నికల్లో బీజేపీకి వ్యక్తుల బలం ఉపయోగపడిందని హరీష్ రావు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తమకు కాంగ్రెస్‌తోనే పోటీ అని హరీష్ అన్నారు. మెజార్టీ స్థానాల్లో కాంగ్రెస్ ఉందని, కాంగ్రెస్ పార్టీకి క్యాడర్ కూడా చాలాచోట్ల ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీకి నాయకత్వం ఉందని, ఆ పార్టీకే లీడర్లు ఉన్నారని స్పష్టం చేశారు. అతి తక్కువ నియోజకవర్గాల్లో మాత్రమే బీజేపీకి క్యాడర్ ఉందన్నారు. చాలా నియోజకవర్గాల్లో బీజేపీకి క్యాడర్, నాయకుడు లేని పరిస్థితి స్పష్టంగా కనిపిస్తుందని హరీష్ రావు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందంటూ ప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై హరీష్ స్పందించారు. అధికారంలోకి వస్తామని చెబితే నాయకులు వస్తారని, నాయకులు జారి పోకుండా ఉంటారని అన్నారు. రాజకీయాల్లో ఎవరైనా సరే ఖచ్చితంగా అధికారంలోకి వస్తామనే చెబుతారన్నారు.

## వైఎస్ షర్మిల పాదయాత్రలో ఉద్రిక్తతలు



నర్సంపేటలో షర్మిల కాన్వాయ్‌లో బస్సు దగ్ధం

ఎమ్మెల్యే పెద్దిపై అనుచిత వ్యాఖ్యలతో టిఆర్ఎస్ ఆగ్రహం

ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో షర్మిల అరెస్ట్..వరంగల్‌కు తరలింపు

వరంగల్,నవంబర్28(సమ సమాజం): వైఎస్ షర్మిల పాదయాత్రలో ఉద్రిక్తతలు ఏర్పడ్డాయి. నర్సంపేట్ నియోజకవర్గంలో షర్మిల పాదయాత్ర చేస్తుండగా.. చెన్నారావుపేట మండలం లింగగిరిలో లంచ్ బ్రేక్ లో కాన్వాయ్ లోని బస్‌ను టీఆర్ఎస్ అనుచరులు తగలబెట్టారు. షర్మిల పాదయాత్ర వాహనాలపై టీఆర్ఎస్ కార్యకర్తలు రాళ్లు రువ్వారు. పలు కార్ల అద్దాలను ధ్వంసం చేశారు. ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అనుచరులు షర్మిల కాన్వాయ్ లోని ఒక బస్సుకు నిప్పు పెట్టారు. షర్మిల గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. పోలీసుల సమక్షంలోనే దాడులు చేశారని అటు వైఎస్సార్ టీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో ప్రజాప్రస్థానం పాదయాత్ర ఉద్రిక్తంగా మారడంతో వైఎస్ షర్మిలను పోలీసులు అరెస్ట్ చేశారు. శంకరమ్మ తండా వద్ద షర్మిల కాన్వాయ్‌పై టీఆర్ఎస్ శ్రేణులు మరోసారి రాళ్ల దాడి చేశారు. పోలీస్ బందోబస్తు ఉన్నా షర్మిల వాహనం అద్దాలు ధ్వంసం చేశారు. టీఆర్ఎస్ కార్యకర్తలు వైయస్సార్ విగ్రహంపై పెట్రోల్ ప్యాకెట్లతో దాడిచేసి నిప్పు పెట్టారు. దీంతో వైసీపీ, టీఆర్ఎస్ శ్రేణులకు మధ్య తోపులాట జరిగింది. వైఎస్ విగ్రహాన్ని, పార్టీ ఫ్లెక్సీలను దగ్ధం చేయడాన్ని గ్రామస్తులు అడ్డుకున్నారు. టీఆర్ఎస్ లీడర్లు గ్రామస్తులపై కోడిగుడ్లు రాళ్లతో దాడికి ప్రయత్నించారు. దీంతో భారీ పోలీస్ కాన్వాయ్ తో ఆమెను వరంగల్‌కు తరలించారు. నర్సంపేట నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో ఇంకా ఆందోళనలు కొనసాగుతు న్నాయి. ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిపై షర్మిల అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ టీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు నిరసనలు చేపట్టారు. అసలు షర్మిలకు తెలంగాణలో పాదయాత్ర చేసే హక్కే లేదని గులాబీ నేతలు నిరసనకు దిగారు. గో బ్యాక్ షర్మిల అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. షర్మిల ఎమ్మెల్యేకి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రస్థానం పాద యాత్రను అడ్డుకుని..తనను అరెస్ట్ చేసేందుకు టీఆర్ఎస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని వైఎస్సార్టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. పాదయాత్రలో శాంతి భద్రతల సమస్యను సృష్టించి యాత్రను అడ్డుకునేందుకే బస్సును తగలబెట్టారని మండిపడ్డారు. పోలీసులు దగ్గరుండి దాడి చేయించారని తెలిపారు. బస్సు అద్దాలు రాళ్లతో పగలగొట్టి, కారుతో దాడి చేయించి..వైఎస్సార్టీపీ కార్యకర్తలను కొట్టారని చెప్పారు.బస్సుకు నిప్పు పెట్టిన ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అనుచరులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గంలో నిర్వహిస్తున్న పాదయాత్రకు పర్మీషన్ ఉందని..కావాలనే పాదయాత్ర వాహనంపై టీఆర్ఎస్ కార్యకర్తలు రాళ్లు రువ్వారని ఆరోపించారు. బస్సుకు నిప్పుపెట్టిన అనంతరం తమ కార్యకర్తలు ఎంతో శ్రమించి మంటలను ఆర్పివేశారని చెప్పారు. ప్రజాస్వామ్యంలో ఇది మంచి పద్ధతి కాదని సూచించారు. ఇలాంటి దాడులకు భయపడబోమని..ఎన్ని కుట్రలు చేసినా పాదయాత్రను ఆపేది లేదని తేల్చిచెప్పారు. ప్రజా సమస్యలపైనే తాను పోరాడుతున్నాని వైఎస్ షర్మిల అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతుంటే టీఆర్ఎస్ నేతలు తట్టుకోలేక దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. ఎన్ని బెదిరింపులు, ప్రలోభాలు, దాడులు చేసినా మొక్కవోని ధైర్యంతో తెలంగాణ ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చే వరకు తన పోరాటం ఆగదన్నారు.



మంత్రి జగదీశ్ రెడ్డితో కలసి ఏరియల్ సర్వే

## యాదాద్రి పవర్ ప్లాంట్ పనుల పరిశీలన

పనలు వివరాలను తెలియచేసిన సిఎండి ప్రభాకర్ రావు

నల్లగొండ,నవంబర్28(సమ సమాజం): నల్లగొండ జిల్లా దామరచర్లలో ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా దామరచర్లలో నిర్మితమవుతున్న యాదాద్రి అల్ట్రా మెగా థర్మల్ పవర్‌ప్లాంటు పనులను సోమవారం పరిశీలించారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో చేరుకున్న సిఎం మంత్రి జగదీశ్ రెడ్డితో కలసి పనుల పురోగతిని పరిశీలించారు. ప్లాంట్ వద్దకు చేరుకున్న సీఎం అక్కడ ప్లాంట్ నిర్మాణపనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యుత్తు శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఆ శాఖ ఉన్నతాధికారులతో కలిసి ప్లాంట్ పనుల పురోగతిని ఏరియల్ వ్యూ ద్వారా సీఎం పరిశీలిస్తున్నారు. రూ.29,965 కోట్లతో 4 వేల మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేసే 5 యూనిట్లను సీఎం పరిశీలిస్తున్నారు. ఇప్పటికే పవర్ ప్లాంట్ రెండు యూనిట్ల పనులు 90 శాతం పూర్తయ్యాయి. మిగతా మూడు యూనిట్లు 70 శాతం వరకు అయ్యాయి. వచ్చే ఏడాది సెప్టెంబర్‌లోగా మొదటి యూనిట్ ద్వారా 800 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేసేలా పనుల్లో వేగం పెంచేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ క్రమంలో స్థానిక టీఎస్ జెన్‌కో, బీహెచ్‌ఈఎల్ అధికారులతో సీఎం సమావేశమై అక్కడ జరుగుతున్న పనులపై సలహాలు, సూచనలు చేసారు. ట్రాన్స్‌కో సిఎండి ప్రభాకర్ రావు తదితరులు కూడా పాల్గొన్నారు. పర్యనటలో ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఇతర ఎమ్మెల్యేలు కూడా పాల్గొన్నారు.

## విభజన హామీలపై సుప్రీంలో విచారణ

విభజన పక్రియ సరిగా జరగలేదన్న ఉండవల్లి



న్యూఢిల్లీ, నవంబర్ 28 (సమ సమాజం): సుప్రీంకోర్టులో విభజన హామీలపై దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిగింది. దీనిపై జస్టిస్ కేఎం జోసెఫ్, జస్టిస్ బీవీ నాగరత్నతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పార్టీ ఇన్ పర్సన్ గా పిటిషనర్ ఉండవల్లి అరుణ్ కుమార్ వాదనలు వినిపించారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు రాష్ట్ర విభజన జరిగిందని..విభజన చట్టాన్ని ఆమోదించే పక్రియ సరిగా లేదన్నారు. పార్లమెంట్ లో లైవ్ టెలికాస్ట్ ఆపేశారని.. రూల్ బుక్ అమలు చేయలేదని కోర్టుకు విన్నవించారు. డివిజన్ కోసం అడిగినా సరే ఓటింగ్ చేపట్టలేదని ఉండవల్లి అన్నారు. 86 మంది మైక్ ద్వారా తమ అభిప్రాయాలు చెప్పారని..మిగతావారు రాతపూర్వకంగా తమ అభిప్రాయాలు చెప్పారన్నారు. విభజన చట్టంలో ఇవేవీ ప్రస్తావించనేలేదని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. పార్లమెంటు చరిత్రలో ఇలా గతంలో ఎప్పుడూ జరగలేదన్నారు. బీహార్, జార్ఖండ్ విభజన సమయంలో ఏకాభిప్రాయం సాధించారన్నారు. గతంలో ఒక కమిషన్ సిఫార్సుల ప్రకారం రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం తప్పనిసరి అని..రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం రాష్ట్ర ఏర్పాటుకు వ్యతిరేకంగా ఉందన్నారు. తాను విభజనకు వ్యతిరేకం అని ఎక్కడా చెప్పలేదన్నారు. నిబంధనల ప్రకారం విభజన పక్రియ జరగలేదన్నదే తన అభ్యంతరమని కోర్టుకు తెలిపారు. ఈ కేసు విచారణను 2023 ఫిబ్రవరి 22కి వాయిదా వేసింది న్యాయస్థానం.

## పూలే ఆశయాలను అమలు చేస్తున్న కెసిఆర్

నివాళి అర్పించిన మంత్రి గంగుల

హైదరాబాద్,నవంబర్28(సమ సమాజం): బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం కృషి చేసిన మహాత్మా జ్యోతిబాపూలే చిరస్మరణీయుడని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా బలహీన వర్గాలకు ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ నివాళులర్పించారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ మహాత్మా పూలే ఆశయాలతో పరిపాలన సాగిస్తున్నారన్నారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్రంలో కేవలం 19 నుంచి 310కు బీసీ గురుకులాలను పెంచి, మహాత్మా జ్యోతిబాపూలే పేరిట ఏర్పాటు చేశారన్నారు. ఉన్నతమైన విదేశీ విద్యను సైతం బీసీలకు అందించడమే కాకుండా ఆత్మగౌరవం నిలిచేలా హైదరాబాద్ నడిబొడ్డున వేల కోట్ల విలువ చేసే 87 ఎకరాలను 41 బీసీ కులాలకు కేటాయించి ఆత్మగౌరవ భవనాల్ని నిర్మిస్తున్నామన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రతి పనిలో బీసీల వాటాను సగర్వంగా అందిస్తున్నారని కొనియాడారు.

## స్కూళ్లో ఆడపిల్లలకు ఫ్రీగా శానిటరీ ప్యాడ్‌లు

సుప్రీంలో పిటిషన్ దాఖలు...నోటీసులు ఇచ్చిన సుప్రీం

న్యూఢిల్లీ,నవంబర్28(సమ సమాజం): ప్రభుత్వ పాఠశాలల్లోని బాలికలకు ఫ్రీగా శానిటరీ ప్యాడ్‌లు అందించాలని కోరుతూ వేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఆరో తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న బాలికలకు ఉచితంగా శానిటరీ ప్యాడ్‌లను అందించాలని, ఆ అవసరం ఎంతైనా ఉందని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై సోమవారం విచారణ జరిపిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. దీనిపై కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను సమాధానం ఇవ్వాలని కోరింది. ఈ పిటిషన్‌ను మధ్యప్రదేశ్‌కు చెందిన డాక్టర్, సామాజిక కార్యకర్త జయ ఠాకూర్ దాఖలు చేశారు. ఈ పిల్‌ని ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహాలతో కూడిన ధర్మాసనం పరిగణలోకి తీసుకుంది. వెంటనే కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్రాలకు, యూటీలకు నోటీసులు జారీ చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో బాలికల పారిశుధ్యం, పరిశుభ్రతలాంటి ముఖ్యమైన సమస్యను పిటిషనర్ లేవనెత్తారని సుప్రీంకోర్టు పేర్కొంది. దీనిపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహత సహాయాన్ని కూడా సుప్రీం ధర్మాసనం కోరింది. బాలికలకు శానిటరీ ప్యాడ్లను ఉచితంగా ఇవ్వాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. ప్యాడ్‌లు కొనే స్థోమత లేకపోవడం వల్ల పేద బాలికలు అనారోగ్యం బారిన పడుతున్నారని, దాని వల్ల వారు చదువును మధ్యలోనే ఆపేయాల్సి వస్తుందని మహిళా సంఘాల నేతలు అంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఫ్రీగా శానిటరీ ప్యాడ్‌లు అందించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ అవసరాన్ని ప్రభుత్వాలు గుర్తించాలని స్వచ్ఛంద సంస్థల నాయకులు ఎప్పటి నుంచో కోరుతున్నారు.

## ఉపాధి హామీపై నోటీసులు జారీ



న్యూఢిల్లీ,నవంబర్28(సమ సమాజం): తెలంగాణ ప్రభుత్వానికి కేంద్రం నోటీసులు జారీ చేసింది. ఉపాధి హామీ పథకంలో అవకతవకలపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దారి మళ్లించిన 152 కోట్ల రూపాయలను నవంబర్ 30లోపు చెల్లించాలని నోటీసులు జారీ చేసింది. లేదంటే తదుపరి వాయిదాలను నిలిపివేసే అవకాశం ఉంది. గత జూన్?లో కేంద్ర బృందాలు తెలంగాణను సందర్శించి.. ఉపాధి హామీ పథకం నిధులను అనుమతి లేని పథకాలకు మళ్లించినట్లు గుర్తించాయి. ఉపాధి హామీ పథకం అమలులో పనుల కేటాయింపులలో పలు అవకతవకలు జరిగాయని నిర్ధారించాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

## మహిళ ఆత్మహత్యాయత్నం

నెల్లూరు,నవంబర్28(సమ సమాజం):నెల్లూరు కలెక్టరేట్ వద్ద చాణిక్యపురికి చెందిన మస్తానమ్మ అనే మహిళ ఆత్మహత్యాయత్నం చేసింది. 29వ డివిజన్ కార్పొరేటర్ సత్తార్ తమ స్థలాన్ని కబ్జా చేశారంటూ బాధితురాలు కుటుంబ సభ్యులతో కలెక్టరేట్ వద్ద ఆందోళన చేసింది. ఎవరూ స్పందించకపోవడంతో ఆత్మహత్యాయత్నం చేసుకుంది. వెంటనే అక్కడున్న స్థానికులు ఆమెను అడ్డుకున్నారు. పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు.

## పూలేకు సిఎం జగన్ నివాళి



అమరావతి,నవంబర్28(సమ సమాజం): మహాత్మా జ్యోతిరావుపూలే వర్ధంతి సందర్భంగా ... తాడేపల్లిలోని సిఎం క్యాంప్ కార్యాలయంలో పూలే చిత్రపటానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాళులర్పించారు. పూలే సేవలను కొనియాడారు. మహిళా విద్యకు చేసిన కృషి జాతి మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి పార్లమెంటరీ పార్టీ నేత, ఎంపి విజయసాయి రెడ్డి, ఎంపి మార్గాని భరత్ రామ్ పాల్గొన్నారు. మరోవైపు ... జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకొని.. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జ్యోతిరావు పూలే కాంస్య విగ్రహానికి మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, జోగి రమేష్ నివాళులర్పించారు.

## బండి సంజయ్ యాత్రకు హైకోర్టు అనుమతి



(మొదటి పేజి తరువాయి) స్పష్టం చేసింది. 500 మందితో మాత్రమే పాదయాత్ర చేయాలని.. 3వేల మందితోనే సభ జరుపుకోవాలని హైకోర్టు నిర్దేశించింది. బీజేపీ నేతలు, కార్యకర్తలు ఇతర వర్గాలను రెచ్చగొట్టేలా మాట్లాడొద్దని సూచించింది. కార్యకర్తలు కర్రలు, వెపన్స్ వాడొద్దని తెలిపింది. లా అండ్ ఆర్డర్ ను పోలీసులు కాపాడాలని ఆదేశించింది. హైకోర్టు షరతులతో కూడిన అనుమతినీయడంతో పాదయాత్రను ఈ నెల 29నుంచి ప్రారంభించాలని బండి సంజయ్ నిర్ణయించారు. సభ కూడా మంగళవారం నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. సెక్యూరిటీ రీజన్స్ పేరుతో పోలీసులు బండి పాదయాత్రకు ఒక్కరోజు ముందు పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో బీజేపీ హైకోర్టును ఆశ్రయించింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పాదయాత్రకు అనుమతిం చేలా ఆదేశించాలని కోరింది. మధ్యాహ్నం 12 గంటలకు బీజేపీ పిటిషన్ పై విచారణ జరిపిన న్యాయస్థానం పాదయాత్ర కొనసాగించేందుకు ఈ మేరకు అనుమతిచ్చింది. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ 28 నుంచి నుంచి డిసెంబర్ 16 వరకూ 5వ విడత ప్రజాసంగ్రామ యాత్ర భైంసా నుంచి తలపెట్టారు. అయితే భైంసా సున్నిత ప్రాంతమని పోలీసులు యాత్రకు తిరస్కరించారు. సభకు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే అనుమతినిచ్చింది.వాస్తవానికి ప్రజాసంగ్రామ యాత్రకు నిర్మల్ జిల్లా పోలీసులు అనుమతి నిరాకరించడంతో బీజేపీ హైకోర్టును ఆశ్రయించింది. భైంసాలో సున్నితమైన పరిస్థితుల దృష్ట్యా అనుమతి నిరాకరిస్తున్నామని పోలీసులు తెలిపారు. బహిరంగసభతో పాటు యాత్రకు కూడా భద్రత ఇవ్వలేమన్నారు.హైకోర్టులో బీజేపీ తరపున రామచందర్ రావు వాదనలు వినిపించారు. భైంసా లోపలి నుంచి పాదయాత్ర వెళ్ళదని కోర్టుకు తెలిపారు. రూట్ మ్యాప్ వివరాలు కోర్టుకు సమర్పించారు. భైంసా వై జంక్షన్ నుంచి పాదయాత్ర వెళుందన్నారు. భైంసా టౌన్‌లోకి పాదయాత్ర ఎంటర్ కాదని స్పష్టం చేశారు. భైంసా టౌన్ లోకి ఎంటర్ కానప్పుడు ఎందుకు అనుమతి ఇవ్వడం లేదని హైకోర్టు ప్రశ్నించింది. భైంసా చాలా సున్నితమైన ప్రాంతమని అడ్వకేట్ జనరల్ బిఎస్ ప్రసాద్ హైకోర్టుకు తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందన్నారు. అయితే వాదనలు విన్న అనంతరం హైకోర్టు షరతులతో అనుమతినిచ్చింది. ప్రజాసంగ్రామ యాత్రలో భాగంగా బండి సంజయ్ ఇప్పటివరకూ 4 విడతల్లో 21 జిల్లాల్లోని 1178 కిలోమీటర్ల పాటు పాదయాత్ర చేశారు. ఐదో విడత పాదయాత్ర ఆయన బాసరలో పూజలు చేసి భైంసాలో ప్రారంభించి కరీంనగర్‌లో ముగించాలనుకున్నారు. బండి సంజయ్ పాదయాత్రను అడ్డుకోవడం సీఎం కేసీఆర్ పిరికిపంద చర్యలకు నిదర్శనమని డీకే అరుణ అన్నారు. బీజేపీ బలపడటాన్ని ఓర్వలేకే ఇలాంటి సిగ్గుమాలిన చర్యలకు దిగుతున్నారని మండిపడ్డారు. బండి సంజయ్ పాదయాత్రను పోలీసులు అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తూ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ట్వీట్ చేశారు. అటు తెలంగాణ ప్రభుత్వానికి పోలీసులు తొత్తులుగా మారారని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ ఓటమి తథ్యమన్నారాయన. మొత్తానికి బండి సంజయ్ అరెస్టుతో తెలంగాణ పాలిటిక్స్ మరోసారి హీటెక్కాయి.

## మహిళల వస్త్రధారణపై అనుచిత వ్యాఖ్యలు

(మొదటి పేజి తరువాయి) మహిళా కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులకు స్పందించిన రాందేవ్ బాబా.. తన వ్యాఖ్యల పట్ల క్షమాపణలు తెలియజేసినట్లు మహారాష్ట్ర మహిళా కమిషన్ ఛైరపర్సన్ రూపాలీ చకాంకర్ ట్విట్టర్‌లో వెల్లడించారు. రాందేవ్ క్షమాపణ లేఖను కూడా పోస్ట్ చేశారు. మహిళలు ఈ సమాజంలో గౌరవప్రదమైన స్థానం పొందాలనే ఉద్దేశంతో వారి సాధికారత కోసమే నేను ఎల్లప్పుడూ కృషి చేస్తాను. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'బేటీ బచావో – బేటీ పడావో' కార్యక్రమాలను నేను ప్రోత్సహిస్తాను. మహిళలను అగౌరవపర్చాలన్న ఉద్దేశం నాకు లేదు. సోషల్‌మీడియాలో వైరల్ అవుతోన్న వీడియో క్లిప్ పూర్తిగా వాస్తవం కాదు. అయినప్పటికీ.. ఎవరైనా బాధపడినట్లయితే నేను తీవ్రంగా చింతిస్తున్నా. నా వ్యాఖ్యల వల్ల బాధపడిన వారికి బేషరతుగా క్షమాపణలు తెలియజేస్తున్నా' అని రాందేవ్ బాబా ఆ నోటీసులకు సమాధానమిచ్చారు. మహిళలు తనలాగా దుస్తులు వేసుకోకున్నా అందంగా కనిపిస్తారు అంటూ యోగా గురు రామ్‌దేవ్ బాబా చేసిన వ్యాఖ్యలపై దేశంలో నిరసనలు వెల్లువెత్తాయి. రామ్‌దేవ్ బేషరతుగా క్షమాపణలు చెప్పాల్సిందేనని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఢిల్లీ మహిళా కమిషన్ చైర్ పర్సన్ స్వాతి మలివాల్ సైతం దేశ మహిళలకు క్షమాపణ చెప్పాలని రామ్‌దేవ్‌ని ట్విట్టర్ మాధ్యమంగా అడిగారు. 'మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ భార్య అమృతా ఫడ్నవిస్ ఎదుట రామ్‌దేవ్ మహిళల్ని ఉద్దేశిస్తూ చేసిన వ్యాఖ్యలు అసభ్యకరమైనవి, ఖండించదగినవి. ఆయన ప్రసంగంతో మహిళల మనోభావాలు దెబ్బతిన్నాయి. ఈ విషయంపై రామ్‌దేవ్ క్షమాపణలు చెప్పాలని ట్వీట్ చేశారు. తెలంగాణలోనూ రామ్‌దేవ్ వ్యాఖ్యలపై మహిళా కాంగ్రెస్ నిరసన చేసింది. నిరసనకారులు రామ్‌దేవ్ బాబా దిష్టి బమ్మను దహనం చేశారు. ఈ నిరసనల్లో మాజీ మంత్రి గీతారెడ్డితోపాటు ఇతర కాంగ్రెస్ నేతలు పాల్గన్నారు. సిపిఐ నారాయణ సైతం రామ్‌దేవ్ చేసిన వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండించారు. యోగా పేరుతో కార్పొరేట్ వ్యవస్థను నడుపుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో చాలా చోట్ల మహిళా సంఘాలు, రాజకీయ పార్టీల మహిళా విభాగాలు రామ్‌దేవ్‌కు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు చేపట్టాయి. ముంబై మహిళా పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో థానేలో ఓ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి వందలమంది మహిళలు విచ్చేశారు. అయితే.. వారిలో చాలామందికి చీరలు ధరించే సమయం దొరక్కపోవడంతో, శిబిరానికి సాధారణ దుస్తుల్లోనే వచ్చారు. ఇది గమనించిన రామ్‌దేవ్.. మహిళలు చీరల్లో బాగుంటారని, సల్వార్ సూట్స్‌లో కూడా బాగానే కనిపిస్తారన్నారు. అక్కడితో ఆగకుండా.. తనలాగా దుస్తులు వేసుకోకపోయినా అందంగా కనిపిస్తారని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.

## ఢిల్లీలో మరో దారుణ హత్య ఘటన

(మొదటి పేజి తరువాయి) సాయంతో రెండో భర్తను దారుణంగా హతమార్చిన భార్య, ఆపై అతడి మృతదేహాన్ని 10 ముక్కలుగా నరికి రిఫ్రిజిరేటర్‌లో దాచింది. ఆ తర్వాత తల్లీకుమారులు ఇద్దరూ కలిసి వాటిని తీసుకెళ్లి ఓ నిర్జన ప్రదేశంలో పడేశారు. జూన్‌లోనే జరిగినట్టుగా తెలుస్తున్న ఈఘటన తాజాగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన మరోమారు సంచలనమైంది. భర్త దాస్ తన తన బంగారు నగలు అమ్మేసి ఆ సొమ్మును మొదటి భార్యకు పంపడంతో పూనం కోపంతో రగిలిపోయింది. ఆ కోపం ప్రతీకారానికి దారితీసింది. మొదటి భర్త కుమారుడు దీపక్‌తో కలిసి దాస్‌ను హత్య చేయాలని పథకం రచించింది. దాస్ తన భార్యను ఇబ్బంది పెడుతుండడంతో హత్యకు తాను అంగీకరించి నట్టు దీపక్ పోలీసులకు చెప్పాడు. దాస్‌ను జూన్‌లో హత్య చేశారు. తొలుత మద్యంలో మత్తుమందు కలిపి ఇచ్చారు. అది తాగిన దాస్ అపస్మారక స్థితిలోకి వెళ్లాక కత్తితో నరికి చంపారు. ఆ తర్వాత మృతదేహం నుంచి రక్తమంతా పోయే వరకు రాత్రంతా మృతదేహాన్ని అలాగే వదిలేశారు. రక్తమంతా పోయిన తర్వాత తెల్లవారుజామున మృతదేహాన్ని 10 ముక్కలుగా కోశారు. వాటిని పాలిథిన్ సంచుల్లో సర్ది ఫ్రిడ్జ్‌లో పెట్టారు. ఆ తర్వాత కొన్ని రోజులపాటు శరీర భాగాలను బయటకు తీసుకెళ్లి పడేసేవారు. పోలీసులు ఇప్పటి వరకు ఆరు భాగాలను స్వాధీనం చేసుకున్నారు. శరీర భాగాలు కనిపించిన ప్రాంతానికి పూనం, దీపక్ వెళ్లినట్టు అక్కడున్న సీసీటీవీ కెమెరాల్లో రికార్డయింది. శరీర భాగాలను పూర్తిగా బయట పడేసిన తర్వాత దుర్వాసన రాకుండా ఇంటిని, ఫ్రిడ్జ్‌ను శుభ్రం చేసినట్టు నిందితులు పోలీసులకు తెలిపారు. దాస్ ఏమయ్యాడని అడిగిన వారికి తమకు చెప్పకుండా ఎటో వెళ్లిపోయాడని చెబుతూ బాధపడినట్టు నటించేవారు.

## కర్ణాటకతో పాటే తెలంగాణలో ఎన్నికలు



(మొదటి పేజి తరువాయి) అన్నారు. ఆరు నెలల ముందే కేసీఆర్ ముందస్తు ఎన్నికలకు వెళ్తారని, కర్ణాటకతో పాటే రాష్ట్రంలోనూ ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. తెలంగాణలో ఏప్రిల్, మేలో ఎన్నికలు జరిగే అవకాశం ఉందని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి జోస్యం చెప్పారు. నిర్మల్ లో బీజేపీ ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన రాజగోపాల్ రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో అధ్వాన్న పాలనపై మండిపడ్డారు. మునుగోడు ఉప ఎన్నికల్లో బీజేపీకి వచ్చిన ఓట్ల మెజార్టీని చూసి కేసీఆర్ కి నిద్ర పట్టడం లేదని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. తెలంగాణలో బీజేపీ బలపడుతోందనే సంకేతాలతోనే బండి సంజయ్ పాదయాత్ర, భైంసా బహిరంగ సభ రద్దుకు ప్రభుత్వం ప్రయత్నం చేసిందన్నారు. కేసీఆర్ ఏకపక్ష నియంత చర్యలతో తెలంగాణలో మరోసారి నిజాం పాలన గుర్తుకు వస్తోందన్నారు. ముందస్తు ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది స్థానాల్లో గెలిచి బీజేపీ క్లీన్ స్వీప్ చేస్తుందని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. అధికార దుర్వినియోగంతోనే మునుగోడులో టీఆర్ఎస్గెలిచిందన్నారు. బీజేపీ కి వస్తున్న ఆదరణతో కేసీఆర్‌లో భయం మొదలైందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ కు భవిష్యత్తు లేదని చెప్పారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు బీజేపీలోకి రావాలని సూచించారు.

## మధ్యప్రదేశ్‌లో కొనసాగుతున్న జోడోయాత్ర



(మొదటి పేజి తరువాయి) గడపడం ఇలా ఆయన అతను కలిసిన సామాన్య వ్యక్తులతో ప్రత్యేక బంధం చూపడం వంటివి చేసి ప్రజల దృష్టిని తనవైపుకు తిప్పుకుంటున్నాడు. సోమవారం ఉదయం ఇండోర్‌లోని బడా గణపతి చౌరమా నుంచి రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ప్రారంభమయింది. ఈ యాత్ర ప్రారంభమయి నేటికి 82 రోజులు పూర్తయింది. ప్రస్తుతం మధ్యప్రదేశ్ రాష్ట్రంలో పాదయాత్ర చేస్తున్న రాహుల్ కన్యాకుమారి వేదికగా దీనిని ప్రారంభించారు. మొత్తం ఐదు నెలల పాటు జరిగే ఈ పాదయాత్రం 3500 కి.మీ దూరం సాగుతుంది. కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం కల్పించాలనే దృఢ సంకల్పంతో రాహుల్ గాంధీ ఈ పాదయాత్రను ప్రారంభించాడు. ఈ యాత్ర ఇప్పటివరకు ఏడు రాష్ట్రాలు, 34 జిల్లాలను కవర్ చేసింది.

## రేవంత్ ఏకపక్ష నిర్ణయాలు: జగ్గారెడ్డి

(మొదటి పేజి తరువాయి) ఆలోచన ఎవరికీ లేదన్నారు. ఎవరితో చర్చించకుండా రేవంత్ రెడ్డి నిర్ణయాలు తీసుకుంటారంటూ మండిపడ్డారు. రేవంత్ ఎందుకు తొందరపడుతున్నారో తెలియదన్నారు. అలాగే రేవంత్ ను తామేమీ ఇబ్బంది పెట్టడంలేదన్నారు. రేవంత్ రెడ్డికి పీసీసీ పదవి ఎలా వచ్చిందో అందరికీ తెలుసని జగ్గారెడ్డి అన్నారు. బండి సంజయ్ కి ఉన్న రాజకీయ తెలివి రేవంత్ కి లేదన్నారు . సొంత పార్టీ నేతలను బద్నాం చేయడమే ఆయన లక్ష్యంగా పెట్టుకున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు అడ్డమైన పంచాయతీలు పెట్టుకున్నారని తెలిపారు. తాను ఏ పార్టీలోకి వెళ్లనని.. అవసరమైతే తానే పార్టీ పెడతానని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

## సిఎం పర్యటిస్తే అరెస్ట్ చేయాలా

(మొదటి పేజి తరువాయి) నల్గొండ జిల్లా దామరచర్లకు సీఎం వస్తే గతంలో ఇచ్చిన హామీలను ఆయన దృష్టికి తీసుకెళ్లడం ప్రధాన ప్రతిపక్ష పార్టీగా తమ బాధ్యత అన్నారు. భూ నిర్వాసితులకు పరిహారాలు, ఇతర సౌకర్యాలు, స్థానికులకు ఉద్యోగాలు, పోడు భూములకు పట్టాలు, జాబ్ కార్డ్స్ గురించి కాంగ్రెస్ నాయకులు సీఎంను అడిగారన్నారు. డీసీసీ అధ్యక్షులు శంకర్ నాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ బృందం ముఖ్యమంత్రిని అడిగేందుకు వెళ్లడం నేరమా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. శంకర్ నాయక్ తోపాటు ఆడివిదేవిపల్లి, దామరచర్ల, మిర్యాలగూడ ప్రాంత నాయకులను అరెస్టులు చేసి జైళ్లలో నిర్భంధించారన్నారు. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## చురుకుగా అంబేడ్కర్ విగ్రహ పనులు



(మొదటి పేజి తరువాయి) వేడుకలు సందర్భంగా విగ్రహాన్ని ప్రారంభిస్తామని వెల్లడించారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వద్ద 125 అడుగుల పొడవైన అంబేద్కర్ విగ్రహాన్ని ప్రభుత్వం నిర్మిస్తున్నది. ఆ పనులను మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌కు అంబేద్కర్ అంటే ఎంతో గౌరవమని, ఆయన రాసిన రాజ్యాంగం వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. ఆ మహానుభావుడి ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి జనరంజక పాలన కొనసాగిస్తున్నారని చెప్పారు. నగరం నడిబొడ్డున 11.5 ఎకరాల్లో నిర్మితమవుతున్న ఈ కట్టడాల గురించి సీఎం కేసీఆర్ మానిటరింగ్ చేస్తున్నారని తెలిపారు. విగ్రహం అడుగు భాగంలో పార్లమెంట్ తరహా నిర్మాణం చేస్తున్నామని వెల్లడించారు. అంబేద్కర్ విగ్రహం కింది భాగంలో అంబేద్కర్ ఫొటో గ్యాలరీతోపాటు ఆయన గొప్పతనం, జీవిత చరిత్రను ఏర్పాటు చేస్తామన్నారు. సినిమా థియేటర్ కూడా ఉంటుందన్నారు. అంబేద్కర్ విగ్రహం పనులు చాలా వేగంగా జరుగుతున్నాయని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. సీఎం కేసీఆర్ ఎప్పటికప్పుడు తమకు సలహాలు సూచనలు ఇస్తున్నారని తెలిపారు.

## బలవంతపు మతమార్పిళ్లపై త్వరలో చట్టం



(మొదటి పేజి తరువాయి) తెచ్చాయని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. కేంద్రం తరపున కూడా అతి త్వరలో చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. బలవంతపు మతమార్పిళ్లకు వ్యతిరేకంగా ఇప్పటికే కొన్ని చట్టాలు తెచ్చాయి. ఒడిశా, మధ్యప్రదేశ్, గుజరాత్, చత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఉత్తరాఖండ్, ఉత్తర్‌ప్రదేశ్, హర్యానా,కర్ణాటక. నిర్బంధం, లేదా, పెళ్లి వంటి కారణాలతో ఒక మతం వారు మరొక మతంలోకి మారడాన్ని ఈ చట్టం నిషేధిస్తోంది. ఈ చట్టం ప్రకారం నేరానికి పాల్పడినవారికి కనీసం మూడేళ్ళ నుంచి గరిష్ఠంగా ఐదేళ్ళ వరకు జైలు శిక్ష విధించవచ్చు, అంతేకాకుండా రూ.25,000 వరకు జరిమానా విధించవచ్చు. మైనర్, మహిళ, షెడ్యూల్డు కులాలు లేదా షెడ్యూల్డు తెగలకు చెందినవారిని చట్టవిరుద్ధంగా మతం మార్చినవారికి 3 నుంచి 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.50,000 వరకు జరిమానా విధించవచ్చు. ఈ చట్టానికి వ్యతిరేకంగా సామూహిక మతమార్పిడులకు పాల్పడినవారికి 3 నుంచి 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.1,00,000 వరకు జరిమానా విధించవచ్చు. మతం మారాలనుకునేవారు కనీసం 60 రోజులు ముందుగా డిప్యూటీ కమిషనర్‌కు తెలియజేయాలని ఈ చట్టం చెప్తోంది. మతం మారిన తర్వాత 30 రోజుల్లోగా ఆ విషయాన్ని తెలియజేయాలని పేర్కొంది.

## 2023 డిసెంబర్ నాటికి యాదాద్రి పవర్ ప్లాంట్



(మొదటి పేజి తరువాయి) వివరించారు. ఫస్ట్ స్టేజ్ యూనిట్ 2లో బాయిలర్ నిర్మాణంలో 82 మీటర్ల ఎత్తులోని 12వ ఫ్లోర్‌లో జరుగుతున్న పనులను సీఎం నిశితంగా పరిశీలించారు. 2023, డిసెంబర్ చివరి నాటికి యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణం పూర్తి చేసి, విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రానికి వెలుగులు పంచాలని జెన్‌కోకు సూచించారు. పనులను వేగవంతం చేయాలన్నారు. 2015లో ఈ పవర్ ప్లాంట్ పనులు ప్రారంభం కాగా, ఇప్పటికే ఎ÷–లాంటులో రెండు యూనిట్ల పనులు 90 శాతం పూర్తయ్యాయి. మిగతా మూడు యూనిట్లు 70 శాతం వరకు అయ్యాయి. 5 వేల ఎకరాల్లో రూ.29,965 కోట్లతో 4 వేల మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యంతో 5 పవర్ ప్లాంట్లను నిర్మిస్తున్నారు. ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్,ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి స్మిత సబర్వాల్, జెన్‌కో సీఎండీ ప్రభాకర్ రావు, రాజ్యసభ సభ్యులు సంతోష్ కుమార్, బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీ కోటి రెడ్డి, ఎమ్మెల్యేలు భాస్కర్ రావు, కంచర్ల భూపాల్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, శానం పూడి సైదిరెడ్డి, గాదరి కిషోర్, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, బొల్లం మల్లయ్య యాదవ్, నల్లగొండ జడ్పీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి, యాదాద్రి భువనగిరి జడ్పీ చైర్మన్ సందీప్ రెడ్డి, జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణా రెడ్డి, తదితరులు

## హైకోర్టు సూచనల మేరకే పాదయాత్ర

(మొదటి పేజి తరువాయి) హైకోర్టు షరతులతో కూడిన అనుమతి మంజూరు చేసింది. అయితే న్యాయస్థానం సూచనల మేరకు సభ నిర్వాహణ, పాదయాత్ర ప్రారంభానికి సమయం లేకపోవడంతో బీజేపీ నేతలు పునరాలోచనలోపడ్డారు. చివరకు బహిరంగ సభతో పాటు పాదయాత్రను మంగళవారం ప్రారంభించాలని నిర్ణయించారు. కోర్టు సూచనల మేరకే పాదయాత్ర నిర్వహిస్తామని మనోహర్ రెడ్డి స్పష్టంచేశారు. రాష్ట్ర ప్రభుత్వ అవినీతి కుటుంబ పాలనను ఎండగడుతూ ప్రజా సంగ్రామ యాత్ర జరుగుతుండటంతోనే టీఆర్ఎస్ ప్రభుత్వం అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని మనోహర్ రెడ్డి ఆరోపించారు. గతంలో పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా సభను అడ్డుకున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఐదో విడత పాదయాత్ర కోసం 10 రోజుల క్రితమే అనుమతి పత్రాలు ఇచ్చిన పోలీసులు సభకు ఒక్క రోజు ముందు పర్మిషన్ రద్దు చేశారని మండిపడ్డారు. ప్రజా సంగ్రామ యాత్ర జరుపు కునేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన హైకోర్టుకు మనోహర్ రెడ్డి ధన్యవాదాలు చెప్పారు.

## తొలిరోజు మల్లారెడ్డి తదితరుల విచారణ



హైదరాబాద్,నవంబర్28(సమ సమాజం): ఐటీ కేసులో మంత్రి మల్లారెడ్డి, ఆయన తనయులను విచారణ కొనసాగాయి. నోటీసులు అందుకున్న 11 మందిని ఐటీ అధికారులు సోమవారం సాయంత్రం వరకు విచారించారు. రూ.100 కోట్లు రూపాయల డోనేషన్‌పై మల్లారెడ్డి కుమారుడు భద్రారెడ్డిని ఐటీ విచారించింది. ఇంజనీరింగ్ కాలేజీల్లో పరిమితికి మించి ఫీజులు, భారీగా డొనేషన్లు వసూలు చేశారనే దానిపై మర్రి రాజశేఖర్ రెడ్డిని ప్రశ్నించారు. మల్లారెడ్డి కళాశాల్లో రూ.100 కోట్లు డోనేషన్‌లు తీసుకున్నట్లు పెద్ద కుమారుడు మహేందర్ రెడ్డి నుంచి ఐటీ అధికారులు సంతకాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇంజనీరింగ్, మెడికల్ సీట్లు కేటాయింపులపై కళాశాల ప్రతినిధులను కూడా ఐటీ ప్రశ్నిస్తోంది. 1994, 2008, 2022లో ఐటీ సోదాలు చేసింది. మల్లారెడ్డి ఇంట్లో దొరికిన రూ.28 లక్షలు నగదు, రాజశేఖర్ రెడ్డి ఇంట్లో దొరికిన రూ.4 కోట్లపై ఆరా తీస్తోంది. సాయంత్రం వరకు 11 మందిని ఐటీ అధికారులు ప్రశ్నించనున్నారు.

## నిరుద్యోగులకు ఏపీ ప్రభుత్వం గుడ్‌న్యూస్

### మొత్తం 6511 పోలీసు ఉద్యోగాల కోసం నోటిఫికేషన్




అమరావతి,నవంబర్28(సమ సమాజం): నిరుద్యోగులకు ఏపీ ప్రభుత్వం గుడ్‌న్యూస్ తెలిపింది. ఇటీవల పోలీసు ఉద్యోగాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మొత్తం 6511 పోలీసు ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ జారీ చేసింది. 411ఎస్ఐ, 6,100 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి షెడ్యూల్ ప్రకటన విడుదలైంది. ఫిబ్రవరి 19న ఎస్సై పోస్టులకు జనవరి 22వ తేదీన కానిస్టేబుల్ పోస్టులకు ప్రిలిమినరీ రాత పరీక్ష జరగనుంది. కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో హోంగార్డులకు 15 శాతం రిజర్వేషన్ కల్పించనున్నట్లు ఏపీ ప్రభుత్వం తెలిపింది. ఏపీఎస్పీ కానిస్టేబుల్ పోస్టులలో హోంగార్డులకు 25 శాతం రిజర్వేషన్ కల్పించనుంది. అయితే ఈ పోస్టుల్లో సివిల్ ఎస్సైలు 315, ఆర్ఎస్సైలు 96, సివిల్ కానిస్టేబుళ్లు 3580, ఏపీఎస్పీ కానిస్టేబుళు 2560 పోస్టులు ఉన్నాయి. ఇక సబ్ ఇన్‌స్పెక్టర్లకు వచ్చే నెల 14 నుంచి, కానిస్టేబుళ్లకు ఈనెలాఖరు నుంచి ఆన్‌లైన్‌లో ఆప్లికేషన్లు ఉండనున్నారు. కాగా, యేటా 6,500 నుంచి 7 వేల వరకు పోలీసు ఉద్యోగాలను భర్తీ చేయాలని ఇటీవల సీఎం వైఎస్ జగన్ పోలీసు శాఖను ఆదేశించారు. ఈ మేరకు పోలీసు శాఖ రూపొందించిన ఉద్యోగాల నియామకానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది.





# చలన చిత్రం




## చిత్రసీమలో రీరిలీజ్‌ల హవా
## బాబా రీరిలీజ్ కోసం మరోమారు డబ్బింగ్

ప్రస్తుతం ఇండస్ట్రీలో రీ-రిలీజ్‌ల హవా నడుస్తుంది. స్టార్ హీరోల బర్త్‌డేలు అయిన, స్టార్ హీరోలు నటించిన సినిమాలు పది, ఇరవై సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 4k ప్రింట్‌తో రీ-రిలీజ్ చేస్తున్నారు. గత రెండు,మూడు నెలల నుండి ఈ ట్రెండ్ మరింత జోరు అందుకుంది. ఇప్పటికే టాలీవుడ్‌లో ఇలా మూడు, నాలుగు సినిమాలు రిలీజై మంచి కలెక్షన్‌లు కూడా సాధించాయి. కాగా ఇప్పుడు సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన బాబా రి-రిలీజ్‌కు సిద్ధమైంది. బాబా సినిమా 2002లో రిలీజైంది. నరసింహా వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత మూడేళ్లు గ్యాప్ తీసుకుని రజనీ ఈ చిత్రాన్ని చేశాడు. ఈ చిత్రం అప్పట్లో అత్యంత భారీ బ్జడెట్‌తో తెరకెక్కిన సినిమాగా రికార్డు క్రియేట్ చేసింది. భారీ అంచనాల నడుమ రిలీజైన ఈ చిత్రం మొదటి రోజు నుండి డివైడ్ టాక్ తెచ్చుకుని డిస్ట్రిబ్యూటర్ నష్టాల్ని తెచ్చిపెట్టింది. కాన్సెప్ట్ కొత్తదే అయినా, కథనం బోరింగ్‌గా ఉండటంతో ప్రేక్షకులు ఈ చిత్రాన్ని తిరస్కరించారు. కాగా ఇరవై ఏళ్ల తర్వాత ఈ సినిమాను రీ-రిలీజ్ చేస్తున్నారు. అంతేకాకుండా రీ-రిలీజ్ వెర్షన్‌లో కొన్ని కొత్త సీన్స్‌ను యాడ్ చేస్తున్నారు. తాజాగా ఆ సీన్స్‌కు సంబంధించిన డబ్బింగ్‌ను సూపర్‌స్టార్ పూర్తి చేశాడు. సురేష్ కృష్ణ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రజనీకి జోడీగా మనీషా కొయిరాల నటించింది. ఏ.ఆర్ రెహమాన్ సంగీతం అందించిన ఈ చిత్రాన్ని లోటస్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై రజనీ స్వీయ నిర్మాణంలో తెరకెక్కించాడు.



## చరణ్‌తో ఉప్పెన డైరెక్టర్ బుచ్చిబాబు సినిమా


ఉప్పెన మూవీతో స్టార్ డైరక్టర్‌గా పేరు సంపాదించుకున్న బుచ్చిబాబు సాన ఎట్టకేలకు తన రెండో మూవీని అనౌన్స్ చేశాడు. తన తదుపరి సినిమాని మెగా పవర్‌స్టార్‌రామ్ చరణ్ తేజ్ తో చేయడానికి రెడీ అయ్యాడు. ఈ విషయాన్ని బుచ్చిబాబు తన ట్విట్టర్ ద్వారా వెల్లడించాడు. ఆర్‌సి 16 పేరుతో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్, వెంకట సతీష్ కిలారు కలిసి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌తో ఈ మూవీ తెరకెక్కతున్నట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం రామ్ చరణ్ శంకర్ తో ఓ మూవీ చేస్తున్నాడు. దీని తరువాత గౌతమ్ తిన్ననూరితో ఒక సినిమా చేయాల్సి ఉంది. ఆ సినిమా క్యాన్సిల్ కావడంతో ఆ ప్లేస్ లోకి బుచ్చిబాబు వచ్చి చేరాడు. ఈ సినిమాకు దేవిశ్రీప్రసాద్ సంగీతం అందించే అవకాశాలున్నాయి. సుకుమార్, రామ్ చరణ్ కాంబినేషన్ లో వచ్చిన రంగస్థలం చిత్రానికి బుచ్చిబాబు అసిస్టెంట్ డైరెక్టర్ గా పనిచేశారు. 'ఆర్ఆర్ఆర్' సినిమాతో రామ్‌చరణ్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. అల్లూరి సీతారామ రాజు పాత్రలో రామ్‌చరణ్ నటనకు గ్లోబల్‌గా గొప్ప ప్రశంసలు దక్కాయి. ప్రస్తుతం చరణ్ లెజండరీ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో 'ఆర్‌సి 15' చేస్తున్నాడు. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. దిల్‌రాజు నిర్మాణ సారధ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం వచ్చే ఏడాది దసరాకు రిలీజ్ కానుంది. ఇక ఈ సినిమా తర్వాత రామ్‌చరణ్, 'జెర్సీ' ఫేం గౌతమ్ తిన్ననూరితో ఓ సినిమా చేస్తున్నట్లు ప్రకటించాడు. కానీ ఈ ప్రాజెక్ట్ పలు కారణాల వల్ల ఆగిపోయింది. ఇదే కథను గౌతమ్, విజయ్‌తో తెరకెక్కిస్తున్నట్లు టాక్. దాంతో చరణ్ 16వ సినిమాకు దర్శకుడు ఎవరా అనేది గత కొన్ని రోజులుగా చర్చలు జరుగుతున్నాయి. తాజాగా ఈ చర్చలకు ముగింపు వచ్చింది. రామ్‌చరణ్ తన 16వ సినిమాను 'ఉప్పెన' ఫేం బుచ్చి బాబు సనా దర్శకత్వంలో చేస్తున్నాడు. బుచ్చిబాబు ఉప్పెన వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ఇప్పటివరకు మరో సినిమా చేయలేదు. నిజానికి ఉప్పెన తర్వాత బుచ్చిబాబు, తారక్‌తో సినిమా చేయాల్సి ఉంది. అయితే తారక్ కొరటాల శివ, ప్రశాంత్ నీల్‌తో సినిమాలు కమిట్ అయ్యాడు. దాంతో బుచ్చి బాబు సినిమాకు ఆలస్యమయ్యేలా ఉంది. ఇప్పటికే బుచ్చి బాబు రెండేళ్లుగా ఏ ప్రాజెక్ట్ చేయలేదు. తారక్‌తో సినిమా చేయాలంటే ఇంకెన్ని రోజులు వేయిట్ చేయాలో అర్థం కాక, చరణ్‌ని లైన్‌లో పెట్టాడు. అయితే ఇది తారక్ కోసం రాసుకున్న కథ కాదని, కొత్త స్టోరీ అని సమాచారం. కాగా తాజాగా ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన వచ్చింది. ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నాడు. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పూర్తి విషయాలు తెలియనున్నాయి.




## తునివు

### సంక్రాంతికి విడుదల కానున్న అజిత్ చిత్రం

తమిళ స్టార్ అజిత్ కుమార్ తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే. గొల్లపూడి మారుతిరావు దర్శకత్వం వహించిన 'ప్రేమ పుస్తకం' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయిన అజిత్ 'వాలి', 'ప్రియురాలు పిలిచింది', 'గ్యాంబ్లర్' వంటి సినిమాలతో తెలుగులో మంచి క్రేజ్ ఏర్పరుచుకున్నాడు. ఈయన నటించిన సినిమాలు తమిళంతో పాటు తెలుగులోనూ ఏకకాలంలో విడుదలవుతుంటాయి. ప్రస్తుతం ఈయన నటించిన తునివు రిలీజ్‌కు సిద్ధంగా ఉంది. హెచ్. వినోద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా విడుదల కానుంది. ఈ చిత్రం తర్వాత విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నాడు. ఇప్పటికే పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలో షూటింగ్ మొదలుపెట్టనుంది. ఈ చిత్రాన్ని పాన్ ఇండియా లెవల్లో తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త నెట్టింట వైరల్‌గా మారింది. ఈ మూవీ డిజిటల్ హక్కులను నెట్‌ఫ్లిక్స్ సంస్థ భారీ ధరకు కొనుగోలు చేసిందని సమాచారం. అన్నీ భాషలకు కలుపుకుని దాదాపు రూ.65 కోట్లకు డీల్ కుదిరికున్నట్లు సమాచారం. ఇంకా షూటింగ్ స్టార్ట్ అవ్వక ముందే ఈ రేంజ్‌లో బిజినెస్ జరిగిందంటే విశేషం అనే చెప్పాలి. మధురై విలేజ్ బ్యాక్ డ్రాప్ కథతో ఈ సినిమా తెరకెక్కనున్నట్లు టాక్. అజిత్‌కు జోడీగా త్రిష నటించబోతున్నట్లు సమాచారం. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రం వచ్చే ఏడాది సెట్స్ పైకి వెళ్లనుంది.




## డిసెంబర్‌లో ఇండియన్-2 కొత్త షెడ్యూల్

ఈ ఏడాది 'విక్రమ్' సినిమాతో మాసివ్ హిట్ అందుకున్న కమల్ హాసన్.. ప్రస్తుతం కొన్ని క్రేజీ ప్రాజెక్ట్ చేస్తున్నారు. వాటిలో 'ఇండియన్2' ఒకటి. శంకర్ రూపొందిస్తున్న ఈ చిత్రానికి మధ్యలో కొన్నాళ్లు బ్రేక్ పడింది. సమస్యలన్నీ పరిష్కరించుకుని ఇటీవల తిరిగి షూటింగ్ మొదలుపెట్టారు. దీంతో ఓ వైపు రామ్ చరణ్‌తో సినిమా చేస్తూనే, మరోవైపు కమల్ మూవీని రీ స్టార్ట్ చేశాడు శంకర్. ప్రస్తుతం చరణ్‌తో న్యూజిలాండ్‌లో ఓ సాంగ్ షూట్ చేస్తున్న శంకర్ టీమ్, ఈ నెలాఖరుకి చెన్నై చేరుకోనున్నారట. డిసెంబర్ 5 నుంచి 'ఇండియన్2' కొత్త షెడ్యూల్ స్టార్ట్ చేసేలా ప్లాన్ చేశారు మేకర్స్. ఇప్పటికే డెబ్బై శాతం షూటింగ్ పూర్తయిన ఈ మూవీపై కమల్ కంప్లీట్ ఫోకస్ పెట్టారట. మార్చి ఎండింగ్‌కు మొత్తం షూట్ కంప్లీట్ చేయాలని చెప్పినట్టు తెలుస్తోంది. కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్‌సింగ్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. సిద్ధార్థ్, ప్రియా భవానీ శంకర్, సముద్రఖని, బాబీ సింహా ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. లైకా ప్రొడక్షన్స్ సంస్థ భారీ బ్జడెట్‌తో నిర్మిస్తోంది. అనిరుథ్ సంగీతం అందిస్తున్నాడు. వచ్చే ఏడాది అక్టోబర్ 14న రిలీజ్ చేయనున్నారు. ఇరవై ఆరేళ్ల తర్వాత కమల్, శంకర్ కాంబోలో 'ఇండియన్' మూవీకి సీక్వెల్‌గా రాబోతున్న ఈ చిత్రం ఎలాంటి రికార్డ్ క్రియేట్ చేస్తుందో చూడాలి!

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in